క్లుప్తంగా

నెట్ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీ, వర్సిటీలు, కళాశాలల్లో అధ్యాపక పోస్టుల నియామకంలో ప్రధాన అర్హతకు యూజీసీ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) ఫలితాలు సోమవారం విడుదల చేశారు. గత నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షకు ఎస్వీయూ పరిధిలో 4,578 మంది హాజరుకాగా 52 శాతం మంది అర్హత సాధించినట్లు సమాచారం.

తిరుపతిలో వ్యవసాయ డిప్లొమో కోర్సు

చంద్రగిరి: తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో 2025–26 సంవత్సరానికి అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుమతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పాలిటెక్నిక్ అఫ్ అగ్రికల్చర్ కళాశాలలో నిర్వహిస్తున్న డిప్లొమా కోర్సులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వెబ్ ఆప్షన్ల నమోదు తేదీని ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.

విధులకు హాజరుకాకుంటే చర్యలు

తిరుపతి సిటీ: సుదీర్ఘకాలం విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని డీఈఓ కేవీఎస్ కుమార్ హెచ్చరించారు. ఓజిలి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రం స్కూల్ అసిస్టెంట్ ఎం సుమనకుమారి గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి విధులు హాజరుకావడం లేదని తెలిపారు. అలాగే దొరవారిసత్రం మండలం కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ విశ్వనాథం గత ఏడాది మార్చి 29 నుంచి విధులకు హాజరుకాలేదని తెలిపారు. వారు విధులకు హాజరు కావాలని, లేని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి రూరల్ : అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించిన రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సంఘాలతో కలిసి ధర్నాకు దిగారు. అనంతరం వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు. నేతలు లోకేష్, వేణు, కె.నాగరత్న, జయప్రభ, ఆర్.సుజాత, ఇ.నిర్మల, జె.గంగాదేవి, శశికళ, సుభాషిణి, వరలక్ష్మి, బుజ్జి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తిరుపతి రూరల్ : మండలంలోని పుదిపట్ల గ్రామ సచివాలయంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోమవారం ఈ మేరకు పద్మావతి వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఉమాదేవి మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంఘమిత్ర మునెమ్మ, మహిళా పోలీసు శ్రీలక్ష్మి, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్ డాక్టర్. ఎం.ఇంద్రాణి పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు ‘సమాచారం’

తిరుపతి రూరల్ : సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులకు నిర్ణీత గడువులోపు సమాచారం అందించాలని ఎంపీడీఓ రామచంద్ర ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. సమాచార చట్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ దయాసాగర్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ : ఏపీఈఎమ్ఏసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు జాబితా మంగళవారం విడుదల కానుంది. ఈ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సీట్ల అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈనెల 23వ తేదీ నుంచి 26 లోపు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల : స్థానిక అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. టీటీడీ చైర్మన్ అధ్యక్షతన 45 అంశాలకు పైగా చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ప్రధానంగా టీటీడీ లోని కాంట్రాక్ట్ డ్రైవర్ల రెగ్యులరైజేషన్, కాంట్రాక్ట్ లెక్చరర్లు, తిరుమలలోని పాత భవనాలను నూతన దాతల స్కీమ్ కింద పునర్నిర్మించే అంశాలపై చర్చించనున్నారు. వేదపారాయణదారులకు కింద నెలకు రూ.3వేలు అందజేయాలనే తీర్మానం నిర్ణయం తీసుకోనున్నారు.

‘సంక్షేమం’ కోసం ఆందోళన


నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చంద్రగిరి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, అలాగే ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. సోమవారం చంద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యలపై సీఐటీయూ నేత వాణిశ్రీ నేతృత్వంలో సీడీపీఓ వాసంతికి వినతిపత్రం అందించారు.

కొత్త పోలింగ్ కేంద్రాలపై సమావేశం

తిరుపతి తుడా : తిరుపతి నియోజకవర్గంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఆవశ్యకత, ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 90 పోలింగ్ కేంద్రాల్లో 1,200 పైగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉంటే సమీపంలోనే మరో పోలింగ్ కేంద్ర ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ మేరకు పార్టీల ప్రతినిధులు ఆయా పోలింగ్ కేంద్రాల వివరాలు పరిశీలించి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్‌బాబు, ఈడీటీ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతకు అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జ్యోత్స్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్(షెటిల్)లో విజేతగా నిలిచింది. సోమవారం ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌కుమార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ మాసులామణి, ఆదిశేఖర్‌రెడ్డి, చిట్టికళావతి, ఈశ్వర్‌బాబు, రమణమ్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


మస్తానమ్మ (ఫైల్)

చంద్రగిరి : మండలంలోని నాగయ్యగారిపల్లెకు చెందిన రామిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మస్తానమ్మ(86) సోమవారం కన్నుమూశారు. 1996 నుంచి 2002 వరకు ఆమె సర్పంచ్‌గా సేవలందించారు. మంగళవారం ఉదయం మస్తానమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

ప్రత్యేక పరిషత్తులతో సంపూర్ణ జ్ఞానం

తిరుపతి సిటీ: విద్యార్థులకు పలు శాస్త్రాల్లో జ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అందించేందుకు జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రత్యేక పరిషత్తులను ఏర్పాటు చేసినట్లు వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన వివిధ పరిషత్తులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతభాషకు వాగ్వర్ధినీ పరిషత్, ఆంగ్ల భాషకు మాక్స్ ముల్లర్ ఇంగ్లిష్ క్లబ్, హిందీ భాష కోసం తులసీదాస్ హిందీ పరిషత్, తెలుగు భాషకు అన్నమాచార్య సాహిత్య కళాపరిషత్, సంస్కృతానికి శ్రీ వేమ భూపాల కళాపరిషత్‌ను ఏర్పాటు చేశామన్నారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, డాక్టర్ భరత్ భూషణరథ్, డాక్టర్ ప్రదీప్ కుమార్ బాగ్, డాక్టర్ ఉదయన హెగ్డే, ప్రొఫెసర్ ఆర్ దీప్తి, డాక్టర్ జగన్‌మోహన్, డాక్టర్ లతామంగేష్, డాక్టర్ వేదప్రకాష్, డాక్టర్ డి నల్లన్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అభినయ ఆర్ట్స్ నాటకోత్సవాలు


విష్ణు వర్ధనుడు పౌరాణిక పద్యనాటకంలోని దృశ్యం


జానపద బృంద నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీల్లో భాగంగా మహతి కళాక్షేత్రంలో సోమ వారం ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొని, తమదైన శైలిలో చక్కటి హావభావాలు, అభినయంతో నృత్య ప్రదర్శనలతో సభికులను అలరింపజేశారు. ఈ సందర్భంగా కళాకారులను అభినయ ఆర్ట్ కార్యదర్శి బీఎస్.రెడ్డి, సంస్థ ప్రతినిధులతో కలిసి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఎస్సీ, ఎస్టీలకు జర్మనీ భాష ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఉద్యోగావకాశాల కోసం ఎస్సీ, ఎస్టీలకు చెందిన మహిళలకు జర్మనీ భాష నేర్చుకోవడం కోసం ఉచితంగా 8 నుంచి 10 నెలలు తిరుపతిలో శిక్షణ ఇస్తామని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిని ఎంపిక చేశారని, ఒక్కొక్క సెంటర్‌లో 50 మందికి మాత్రమే శిక్షణ ఇస్తారని చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల పాటు క్లినికల్ అనుభవం ఉండాలని చెప్పారు. జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి 3 ఏళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. 35 ఏళ్లు మించకూడదని స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జర్మనీ భాషపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 8 నుంచి 10 నెలలు శిక్షణ తర్వాత బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, అంతేకాకుండా ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్ కాపీ, క్లినికల్ అనుభవం పత్రం ఉండాలని తెలిపారు. తిరుపతిలోని బైరాగిపట్టెడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో శిక్షణ ఉంటుందని చెప్పారు. డీఎస్‌సీడబ్ల్యూఈఓటీపీటీఃజీమెయిల్.కామ్ ద్వారా దరఖాస్తులను పంపాలని చెప్పారు. అదనపు సమాచారం కోసం 9441408045, 9441578020, 9492374059 ,8985121151, 8639627455 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏబీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడిగా రాస్ వెంకటరత్నం


సర్టిఫికెట్‌ను అందుకుంటున్న రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం

తిరుపతి కల్చరల్: స్వర్గీయ పద్మవిభూషణ్ డాక్టర్ నిర్మలాదేష్ పాండే స్థాపించిన అఖిల భారత రచనాత్మక సమాజ్(ఏబీఆర్‌ఎస్) జాతీయ అధ్యక్షుడిగా రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నియమితులయ్యారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో సేవాధామ్ ఆశ్రమంలో ఈనెల 20వ తేదీన ఏబీఆర్‌ఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎస్.వెంకటరత్నంను ఏబీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడిగా ఎంపిక చేసి, ఆలిండియా హరిజన సేవక్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు శంకర్ కుమార్ సన్యాల్, బీహార్ మాజీ ఎంపీ నరేశ్ యాదవ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారు. రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, జనరల్ బాడీ సభ్యులు, ఇతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎస్వీయూ సైన్స్ కళాశాలకు ఎన్‌పీటీఈఎల్ ప్రశంసలు


ప్రొఫెసర్ భారతికి ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: జాతీయ విద్యా విధానం–2020లో భాగంగా వర్సిటీలో విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందే కోర్సులను ‘స్వయం’ రూపొందించిన విషయం తెలిసిందే. ఈ కోర్సుల రూపకల్పన, బోధనలో ఐఐటీ, ఎన్ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎస్వీయూ పీజీ కోర్సుల్లో స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. 2025 జనవరి – ఏప్రిల్ సెమిస్టర్లలో వర్సిటీ సైన్స్ కళాశాల గణిత విభాగానికి చెందిన ఆచార్య భారతి కీలక భూమిక పోషించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రశ్నిస్తూ ఎన్‌పీటీఈఎల్ సంస్థ ప్రశంసా పత్రాలు పంపింది. ఈ సందర్భంగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి ఆమెను అభినందించారు.

ఔట్ సోర్సింగ్ శానిటరీ సిబ్బందికి జీతాలు పెంపు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ శానిటరీ సిబ్బందికి వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన వేతనాలు ఆయా మున్సిపల్ కార్యాలయాల సొంత నిధుల నుంచే ఇవ్వాల్సి ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వదని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. కేటగిరి–1 కింద పనిచేస్తున్న శానిటరీ వర్కర్లకు రూ.21,500 నుంచి రూ.3 వేలు పెంచుతూ రూ.24,500 వేతనం చెల్లించనున్నారు. అలాగే కేటగిరీ–2 వర్కర్లకు ప్రస్తుతం అందిస్తున్న రూ.18,500 నుంచి రూ.21,500 పెంచారు. కేటగిరీ–3 వర్కర్లకు రూ.15 వేల నుంచి రూ.18,500 చెల్లించాలని నిర్ణయించారు.

చెక్ బౌన్స్ కేసులో కింది కోర్టు తీర్పు అమలు

తిరుపతి లీగల్:చెక్ బౌన్స్ కేసు తీర్పుపై దాఖలు చేసిన అపీల్‌ను కొట్టి వేస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి సోమవారం తీర్పు చెప్పినట్టు ఫిర్యాది తరపు న్యాయవాది ముని భాస్కర్ తెలిపారు. తిరుపతి, పీకే లేఅవుట్‌కు చెందిన కే వెంకట్ రెడ్డి వద్ద తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, సీఆర్పీఎఫ్‌లో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న పి విజయదుర్గ అలియాస్ జీవి దుర్గ భర్త 2012 అక్టోబర్ 25వ తేదీ రూ.11 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2016 నవంబర్ నెలలో రూ.5.50 లక్షల విలువచేసే రెండు చెక్కులను ఆమె వెంకట్‌రెడ్డికి ఇచ్చారు. అతను ఆ రెండు చెక్కులను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. దీనిపై అతను విజయదుర్గపై తిరుపతి ఆరో అదనపు ప్రత్యేక జూనియర్ జడ్జి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మూడు నెలల్లోపు ఆమె రూ.15,60,000 అతనికి చెల్లించాలని, లేకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై ఆమె స్థానిక నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు తీర్పును అమలు చేయాలంటూ తీర్పులో పేర్కొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించండి

- గ్రీవెన్స్‌కు 329 అర్జీలు
- ఒక్కో అర్జీదారునిది..ఒక్కో ఆవేదన


అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్


ఆవేదన వ్యక్తం చేస్తున్న మంగమ్మ, వెంకటసుబ్బయ్య

తిరుపతి అర్బన్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.. ప్రతి అర్జీకి సంబంధించిన సమస్యను పరిష్కారించాలని జేసీ శుభం బన్సల్ పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలకు కొందరు కలెక్టరేట్‌కు వస్తున్నారని, స్థానికంగా అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 329 అర్జీలు వచ్చాయి. అందులో 165 అర్జీలు రెవెన్యూ సమస్యలు కాగా వివిధ సమస్యలపై 100 మందికి పైగా దివ్యాంగులు గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేశారు. గ్రీవెన్స్ సమయంలో కొందరు అధికారులు కలెక్టరేట్ ప్రాంగణంలో తిరుగుతూ ఫోన్లు మాట్లాడుకుంటూ కాలయాపన చేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్ సోమవారం మధ్యాహ్నం వరకు అందుబాటులో లేకపోవడంతో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దామినేడులో నాగాలమ్మ ఆలయాన్ని ఓ నేత కూల్చివేశారని, అయితే తిరిగి నిర్మిస్తామని రెవెన్యూ అధికారుల వద్ద హామీ ఇచ్చిన పట్టించుకోవడం లేని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. డక్కిలి మండలం దగ్గవోలులో ఈ నెల 25, 26, 27 తేదీల్లో తాళమ్మ కొలుపు నిర్వహిస్తున్నందున గ్రామంలోని మద్యం దుకాణాన్ని మూసివేయాలన్నారు. రోడ్డు విస్తరణలో ఇల్లు తొలగింపునకు అధికారులు మార్కింగ ఇచ్చి రెండు నెలలైనా తమకు పరిహారం అందలేదని రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీకి చెందిన మంగమ్మ (78), వెంకటసుబ్బయ్య(81) దంపతులు జేసీకి విన్నవించారు. తాము లేచి నిలబడలేని స్థితి అని, తమ గ్రామస్తుడు శివప్రసాద్ తమను కలెక్టరేట్‌కు తీసుకొచ్చారన్నారు. వారిద్దరు కలెక్టరేట్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో బీపీ, షుగర్ పరీక్షలతోపాటు మందులు స్వీకరించారు.

ఆలయంలో పోతురాజు విగ్రహం చోరీ


మాయమైన విగ్రహం

చంద్రగిరి: మండల పరిధిలోని శానంభట్ల పంచాయతీలోని పాత శానంభట్ల గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పూజలందుకుంటున్న పోతురాజు రాతి విగ్రహాన్ని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 90 అర్జీలు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 90 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో చోరీలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.


ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఒక్కొక్కరికి ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్లు ఖ్యాతి, భాను ప్రసాద్ కథనం మేరకు.. 2018 జూలై మూడో తేదీ పీలేరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు అందిన సమాచారం మేరకు గానుగ చింత –రొంపిచర్ల మార్గంలో ఫారెస్ట్ సిబ్బంది వాహన తనిఖీ చేపట్టారు. ఒక కారు అతివేగంగా రావడాన్ని గుర్తించి ఫారెస్ట్ సిబ్బంది ఆ కారును ఆపగా, ఆపకపోవడంతో వెంబడించి, పట్టుకున్నారు. కర్ణాటక, బెంగళూరు, ఆనేకల్ తాలూకా, జిగల గ్రామానికి చెందిన టి.మునియప్ప, కర్ణాటక , బెంగళూరు, ఆనేకల్లు తాలూకా, ఆడిగర కాలహళ్లికి చెందిన ఎస్.మంజునాథను అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న 60 కిలోల ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రొంపిచర్ల బీట్, పెండ్లి కనుమ అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా మార్చి బెంగళూరుకు తరలిస్తున్నట్లు నేరం అంగీకరించారు. పీలేరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పచ్చిరొట్ట సాగుపై పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: పచ్చిరొట్ట విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో 50శాతం రాయితీతో ఇస్తున్నారని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులతో కలసి కలెక్టర్ వెంకటేశ్వర్ పచ్చిరొట్ట, జీవన ఎరువులు అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ ధనంజయరెడ్డి, ఏవో గాయత్రి, ప్రకృతి సేద్యం అధికారి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆదేశించినా..ఎంపీడీఓ కనికరించరా?


వెంకటరమణ ఇంటికి దారి లేకుండా ఏర్పాటు చేసిన కంచె

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ‘పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డుపై కంచె ఏర్పాటు చేసి ఓ ఇంటికి రాకపోకలు లేకుండా చేస్తుంటే మీరు ఏం చేస్తున్నారు.. తక్షణం ఆ గ్రామానికి వెళ్లి ఆ ఇంటికి అడ్డుగా నిర్మించిన ఇనుప కంచెను తొలగించండి.. ఆ దారిలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయండి..’ అని జేసీ శుభం బన్సల్ ఎర్రావారిపాళెం ఎంపీడీఓ సీహెచ్ మదనమోహన్ రాజును ఆదేశించారు. అయినా ఆయన ఏ మాత్రం పట్టించుకోలేదు. ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లి పంచాయతీ బడగనపల్లిలో నివాసముంటున్న వెంకటరమణ ఇంటికి అదే గ్రామానికి చెందిన చరణ్‌కుమార్, మంజుల, రాజేశ్వరి దారి లేకుండా అడ్డుకోవడాన్ని సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందించారు. తమ ఇంటికి వెళ్లడానికి వీలు లేకుండా పంచాయతీకి చెందిన సిమెంటు రోడ్డుపై ఇనుప కంచెను కట్టిన ఫొటోలు, సాక్షి పత్రికలో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌లను చూపించారు. దీనిపై శుభం బన్సల్ వెంటనే స్పందించి ఎర్రావారిపాళెం ఎంపీడీఓ మదనమోహన్‌రాజుకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బడగనపల్లిలో సమస్యను తక్షణం పరిష్కరించి తనకు ఫోన్ చెయాలని ఆదేశించారు. అయినా ఆ ఎంపీడీఓ ఏ మాత్రం లెక్క చేయకపోవడం, పైగా రాజకీయ ఒత్తిళ్లతో తాను ఆ సమస్య పరిష్కరించలేనని బాధితుడు వెంకటరమణకు చెప్పడం విశేషం. కాగా ఇనుప కంచెను తొలగించడానికి పోలీసులు ముందుకు వచ్చినా ఎంపీడీఓ ముఖం చాటేయడంతో వారు కూడా వెనుదిరిగి వెళ్లక తప్పలేదు. గత వారం రోజులుగా తమ ఇంటికి దారి లేకుండా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఆ దారిలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.





వంచనకే కూటమి

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కూటమి కట్టారు. జగనన్న కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అందిస్తామని నమ్మించారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు.. అధికారంలోకి వచ్చాక నిలువునా వంచించారు. చంద్రబాబు మాట విన్నందుకు మా కొంప ముంచారు. నిరుపేదలమనే కనికరం కూడా లేకుండా 'నోటి కాడ కూడు లాగేశారు' అంటూ నగర వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో తమ గోడు వెళ్లబోసుకున్నారు.


పెద్దకాపువీధిలో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష

- సూపర్ సిక్స్ అంటూ ఆశపెట్టి మోసం చేశారు
- ఏడాదిగా ఒక్క పథకం కూడా అమలు చేయలేదు
- అభినయ్‌రెడ్డితో గోడు వెళ్లబోసుకున్న నగర వాసులు
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించిన అభినయ్

తిరుపతి మంగళం : కూటమికి ఓట్లు వేస్తే సంక్షేమం మీ ఇంట ఉన్నట్టే అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కూటమి కట్టి మా కొంప ముంచారంటూ నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో ఈ పథకాలు అందిస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలతో ష్యూరిటీ బాండ్లు చేతికి ఇచ్చి చివరకు మొండి చెయ్యి చూపించారంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను నగరంలోని 11, 22, 27, 42, 43వ డివిజన్లలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కూటమి నేతలు మా ఇళ్ల వద్దకు వస్తే చొక్కా పట్టుకుని నిలదీస్తామని స్పష్టం చేశారు.

వెన్నుపోటుకు కేరాఫ్ బాబు

దేశంలోనే వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పారని విమర్శించారు. మేయర్ డాక్టర్ శిరీష, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్ రెడ్డి, తమ్ముడు గణేష్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, తులసీయాదవ్, జ్యోతిప్రకాష్, తుడా వెంకటరెడ్డి, రాజ, చక్రి, విజయ రాయల్, రమేష్ పాల్గొన్నారు.

దుస్థితిలో రహదారులు

నగరంలో రోడ్లు అధ్వాన్నంగా మారాయని సుందరయ్యనగర్, సప్తగిరినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు భూమన అభినయ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దారుణంగా తయారైన రహదారుల్లో రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోయారు. సీసీ రోడ్లు నిర్మించాలని కూటమి నేతలు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై అభినయ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఆ మేరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


రోడ్డు సమస్యను అభినయ్‌రెడ్డికి విన్నవిస్తున్న ప్రజలు

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం పవిత్ర సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపన మూర్తులు, బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అలాగే విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగానున్న ఆంజనేయ స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. కాగా సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.


పవిత్రమాలలను తీసుకొస్తున్న అర్చకులు